17 నుంచి కనకమహాలక్ష్మి అమ్మవారి జాతర

చీపురుపల్లి, మార్చి 10: కనకమహాలక్ష్మి అమ్మవారి జాతర మహోత్సవాలు ఈ నెల 17,18,19 తేదీల్లో జరుగనున్నాయి. ఆలయ కమిటీ చైర్మన్ ఇప్పిలి గోవింద, నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనా యుడు, బెల్లాన వంశీకృష్ణ నేతృత్వంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఏటా మహా శివరాత్రి వెళ్లిన మొదటి ఆదివారం జాతర ప్రారంభించడం ఆనవాయితీ. ఈ సంవత్సరం శివరాత్రి వెళ్లిన తొలి ఆదివారం అమావాస్య ఘడియలు ఉండడంతో రెండో ఆదివారం నుంచి జాతర నిర్వహించనున్నారు. జాతరకు సంబంధించిన అన్ని శాఖల అధికారులు, పోలీసులతో సోమవారం సమావేశం కూడా నిర్వహించనున్నారు.

టెన్షన్.. టెన్షన్



కొత్తవలస రైల్వేస్టేషన్ సమీపంలో పట్టాలు తప్పి ఒరిగిన రాయగడ పాసింజర్ రైలు

● పట్టాలు తప్పిన రాయగడ పాసింజర్ ● కొద్ది క్షణాలు హడలిపోయిన ప్రయాణికులు ● పైలెట్ అప్రమత్తతతో తప్పిన పెను ప్రమాదం ● రెండు గంటల తర్వాత బయలుదేరిన రైలు

లక్కవరపుకోట(కొత్తవలస), మార్చి 10 : అది రాయగడ పాసింజర్ రైలు. అప్పుడే కొత్తవలస రైల్వేస్టేషన్‌కు వచ్చింది. కొద్ది సెకెన్ల తర్వాత నెమ్మదిగా బయలుదేరింది. స్టేషన్ దాటిందనగా ఒక్కసారిగా రైలులో కుదుపు చోటుచేసుకుంది. ఉన్నపలంగా ఆగిపోయింది. భయపడిన ప్రయాణికులు కేకలు వేస్తూ బయటకు వచ్చేశారు. రెప్పపాటులో ప్రమాదం తప్పిందని తెలుసుకుని హమ్మయ్యా అనుకున్నారు. వివరాల్లోకి వెళితే..

భవానీపట్నం నుంచి విశాఖ దాటుకుని వస్తున్న రాయగడ పాసింజర్ రైలు ఆదివారం రాత్రి 7 గంటల సమయంలో కొత్తవలస రైల్వేస్టేషన్‌కు చేరింది. కొద్దిసెకెన్ల తర్వాత యథాతథంగా బయలుదేరింది. సుమారు వందమీటర్ల దూరం వెళ్లిసరికి పట్టాలు తప్పింది. ట్రాక్ సరిగా క్రాస్ అవ్వకపోవడాన్ని పైలెట్ గుర్తించాడు. అప్పటికే ఇంజిన్, ఒక బోగీ కొద్దిగా ఒరిగిపోవడంతో బ్రేక్ వేశాడు. అకస్మాత్తుగా రైలంతా ఆగిపోయింది. ఆ కుదుపు తీవ్రతకు ప్రయాణికులు ఏం జరిగిందోనని భయపడ్డారు. రైలు దిగిపోయి కేకలు వేశారు. కొద్దిసేపటి వరకు ఎవరికీ ఏం జరిగిందో తెలియలేదు. ఒక్కొక్కరూ ముందుకు వెళ్లి ఆరా తీయడం ప్రారంభించారు. ఇంజిన్, బోగీ ఒరిగి ఉండడాన్ని చూసి ఊపిరి పీల్చుకున్నారు. అంతలో కొత్తవలస రైల్వే సిబ్బంది పరుగున వచ్చి పరిశీలించారు. విశాఖ నుంచి కూడా సాంకేతిక సిబ్బంది వచ్చి పునరుద్ధరణ పనులు చేపట్టారు. రెండు గంటల తర్వాత మళ్లీ రైలు యథాతథంగా బయలుదేరింది. ప్రస్తుతానికి ఆ ట్రాక్‌పై ప్రయాణం ఆపేశారు. కాగా విశాఖ నుంచి వేలాదిమంది కార్మికులు, ప్రయాణికులు నిత్యం ఈ రైలులోనే గమ్యస్థానాలకు వెళ్తారు. అయితే జనవరిలో జామి మండలం అలమండ-కంటకపల్లి మధ్యలో జరిగిన రైలు ప్రమాదం గుర్తుకు వచ్చి ప్రయాణికులు భయపడ్డారు. సకాలంలో రైల్వే సిబ్బంది, ఆర్‌పీఎఫ్ దళం సంఘటనా స్థలానికి చేరుకొని అందరినీ అప్రమత్తం చేశారు. చిన్న ప్రమాదం కూడా లేకపోవడంతో ప్రయాణికులంతా ఊపిరి పీల్చుకున్నారు.

నాణ్యతేదీ?

● నిర్మాణ పనుల్లో తేటతెల్లమవుతున్న డొల్లతనం
● రహదారుల దుస్థితిని చూపుతున్న స్థానికులు
● థర్డ్ పార్టీ క్వాలిటీ కంట్రోల్ పాత్రపై అనుమానాలు

మున్సిపాలిటీలో రోడ్లు, కాలువల నిర్మాణ పనుల్లో నాణ్యతాలోపాలపై అటు స్థానికుల నుంచి ఇటు ప్రజాప్రతినిధుల నుంచి తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వాటిని పరిశీలిస్తే ఎక్కడికక్కడ డొల్లతనం స్పష్టంగా కనిపిస్తోంది. రోడ్లు వేసిన కొద్దిరోజులకే రాళ్లు తేలిపోయాయి. ఇతర పనుల్లోనూ నాణ్యత తీసికట్టుగా ఉంది. ఇదంతా తెలిసే పాలకవర్గం మొక్కుబడిగా క్వాలిటీ కాంట్రోల్ ఏజెన్సీని తెరపైకి తెచ్చిందన్న వాదన వినిపిస్తోంది. నిధుల వృథాకేనని స్థానికులు ఆరోపిస్తున్నారు.



బొబ్బిలి: నాణ్యతాలోపంగా తారకరామ కాలనీ రోడ్డు

బొబ్బిలి, మార్చి 10:
ఆర్థిక సంఘం నిధులు, గడపగడపకూ పథకం, మున్సిపల్ జనరల్ ఫండ్ ఇలా వివిధ రకాల పథకాల కింద కోట్లాది రూపాయలను వెచ్చిస్తూ బొబ్బిలిలో చేపట్టిన పనుల్లో ఏమాత్రం నాణ్యత లేదన్నది సుస్పష్టం. వార్డుల్లో చేపట్టిన రోడ్లు, కాలువలు ఏడాది కాకమునుపే పూర్తిగా పాడైపోతున్నాయి. రోడ్లపై రాళ్ల పిక్కలు తేలిపోతు న్నాయని, గుంతలు ఏర్పడుతున్నాయని, వర్షాలు కురిస్తే అంతే సంగతి అని పట్టణ టీడీపీ అధ్యక్షుడు రాంబార్కి శరత్‌బాబు, ఇతర కౌన్సిలర్లు కౌన్సిల్ సమావేశపు వేదికలోనే కాకుండా బయట కూడా అధికార యంత్రాంగాన్ని నిలదీస్తున్నారు. ఇదిలా ఉండగా అభివృద్ధి పనులను తనిఖీ చేసి నివేదిక ఇచ్చేందుకు రెండేళ్ల కాలవ్యవధిని నిర్దేశిస్తూ థర్డ్‌పార్టీ క్వాలిటీ కంట్రోలు వ్యవస్థను మున్సిపాలిటీ నియమించుకుంది. దాని గడువు నెలాఖరుతో ముగుస్తుండడంతో మరో ఏజెన్సీకి బాధ్యతలను అప్పగించేందుకు కూడా చర్యలు తీసుకుంది. అయితే ఈ వ్యవస్థపై సర్వత్రా అనేక అనుమానాలు ఉన్నాయి. అధికార పార్టీ అండదండలున్నాయని ప్రధాన ఆరోపణ. ఇదంతా ఒకెత్తయితే పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు అందడం లేదు. తీసుకున్న రుణా లకు వడ్డీలు చెల్లించలేక వారు నానా అవస్థలు పడుతున్న నేపథ్యంలో క్వాలిటీ కంట్రోలు ఇస్తున్న నివేదికలు గుదిబండగా తయారయ్యాయని వారు గగ్గోలు పెడుతున్నారు.

● నాణ్యతా పరీక్షల్లో భాగంగా ఒక్కో కోర్ కటింగ్‌కు 2 వేల నుంచి రూ.2,500 వరకు కాంట్రాక్టు ఏజెన్సీకి చెల్లిస్తారు. ఈ చెల్లింపులకు జీఎస్‌టీ అదనం. ఈ వ్యవస్థకు కూడా సహజంగా అధికార పార్టీ అండదండలుంటాయన్నది బహిరంగ రహస్యమే. ఏదేమైనా ప్రజాధనం దుర్వినియోగం కాకుండా నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నది ప్రజల వాదన.

నాణ్యతా ప్రమాణాలకు పెద్దపీట

లాలం రామలక్ష్మి, మున్సిపల్ కమిషనర్, బొబ్బిలి

నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలకు పెద్దపీట వేస్తాం. నిబంధనల ప్రకారమే బిల్లుల చెల్లింపునకు సిఫార్సు చేస్తాం. దీనిపై ఎటువంటి అనుమానాలకు తావులేదు.

చీపురుపల్లికేనా మంత్రి?



● మూడు పార్టీల పొత్తుతో సత్తిబాబులో తెలియని ఆందోళన
● ఇటీవల కాలంలో తరచూ నియోజకవర్గానికి రాక ● గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి

ఎప్పుడో కాని నియోజకవర్గంలో కనిపించని మంత్రి బొత్స కొన్నాళ్లుగా తరచూ వస్తున్నారు. ఇతర షెడ్యూల్ ఉన్నా కూడా సర్దుబాటు చేసుకుని ఇక్కడికే వచ్చేందుకు మొగ్గు చూపుతున్నారు. ఓటమిపై అనుమానం కలుగుతోందో లేక టీడీపీ, జనసేన ఉమ్మడి కూటమి పోటీలో ఉండడంతో గెలుపుపై నమ్మకం సడలిందో కాని కొద్దిరోజులుగా ఆయన వేస్తున్న అడుగులు అనేక సందేహాలను లేవనెత్తుతున్నాయి. చీపురుపల్లికేనా మంత్రి అని కొందరు ఎద్దేవా చేస్తున్నారు. అంతలా బొత్స దృష్టి పెట్టారు. మరోసారి అవకాశం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు.

విజయనగరం (ఆంధ్రజ్యోతి)
రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన ఉమ్మడిగా పోటీ చేస్తాయన్న వార్తలు వస్తున్నప్పటి నుంచే మంత్రి బొత్స సత్యనారాయణ అలెర్ట్ అయ్యారు. చీపురుపల్లికి క్యూ కడుతున్నారు. ఈ ఐదేళ్లలో ఆయన చీపురుపల్లి వచ్చిన సందర్భాలు వేళ్లపై లెక్కపెట్టవచ్చు. ఏదైనా పెద్ద కార్యక్రమం ఉంటే కాని మొహం చూపెట్టేవారు కాదన్న విమర్శ ఉంది. ఇటీవల కాలంలో తరుచూ నియోజకవర్గంలో ప్రజల్ని పలకరిస్తున్నారు. అధికార పర్యటనల పేరుతో సభలు, సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. అక్కడికి వచ్చే వివిధ వర్గాల ప్రజలను మళ్లీ గెలిపించాలని వేడుకుంటున్నారు. వీలు కుదిరినప్పుడల్లా నియోజకవర్గంలోని ఏదో మండలంలో పర్యటనకు వస్తున్నారు. ఈ పర్యటనలన్నీ అధికారిక షెడ్యూల్‌లో ఉన్నప్పటికీ లోకల్ లీడర్లు, మండల నాయకులు, బూత్ కమిటీల ప్రతినిధులు, గృహసారథులు, వలంటీర్ల గురించే ఆయన ఆరా తీస్తున్నారు. గెలుపుకోసం కృషిచేయాలని సూటిగా కోరుతున్నారు.

కాగా రాష్ట్రవ్యాప్తంగా మారుతున్న రాజకీయ సమీకరణాలు, చీపురుపల్లికి కొత్త వ్యక్తులు రావొచ్చునన్న వార్తలు, మేనల్లుడు చిన్న శ్రీనుతో బేదాభిప్రాయాలు తదితర కారణాలతో చీపురుపల్లిపై ఆయనే స్వయంగా దృష్టి పెట్టి ఉండొచ్చునని పరిశీలకులు అభిప్రాయపడు తున్నారు. మంత్రి భార్య, మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మీ కూడా ఎప్పటికప్పుడు చీపురుపల్లి నియోజకవర్గ నేతలతో మాట్లాడడం.. పరిస్థితిని తెలుసుకోవడం జరుగుతోంది. మంత్రి బొత్స నెల రోజుల నుంచి తన కుమారుడు బొత్స సందీప్‌ని కూడా వెంట పెట్టుకుని ఆ నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలకు మరో నాలుగు రోజులే సమయం వున్న నేపథ్యంలో మంత్రి బొత్స సత్యనారాయణ ఈ ప్రాంతంలో పర్యటించడం, తరచూ ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయడం, గెలిపించాలని పదేపదే కోరడంపై ప్రజల్లో అనేక చర్చలు జరుగుతున్నాయి.

చీపురుపల్లి నియోజకవర్గ పరిధిలోని గుర్ల, గరివిడి, చీపురుపల్లి, మెరకముడిదాం మండలాల్లో ఆయన సుడిగాలి పర్యటన చేస్తున్నారు. అయితే ఇంటిపోరు కూడా అదేస్థాయిలో ఉందంటున్నారు. జడ్పీచైర్మన్‌కు మంత్రికి మధ్య కొన్నాళ్లుగా పొసగటం లేదంటున్నారు. వీరిద్దరి మధ్య రాజకీయ యుద్ధమే జరుగుతోందనే వార్తలు గుప్పుమంటున్నాయి. ఇదే నియోజకవర్గంలో మెరకముడిదాం జడ్పీటీసీగా చిన్న శ్రీను ఉండడం సత్తిబాబు ఆందోళన చెందుతున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న కిమిడి నాగార్జున కూడా ఐదేళ్లలో పార్టీని బలోపేతం చేశారు. బహిరంగంగానే మంత్రి, సీఎం జగన్‌పై ఆరోపణలు చేస్తూ తెలుగుదేశం పార్టీని ప్రజల్లోకి తీసుకువెళ్లారు. మరో వైపు రాజకీయ కుటుంబం నుంచి బలమైన సామాజిక వర్గం కలిగిన కోట్ల సుగుణాకరరావు ఈ మధ్యకాలంలో టీడీపీ గూటికి చేరడం బొత్స సత్యనారాయణకు ఇబ్బందికర పరిణామంగా మారిందంటున్నారు. టీడీపీ, జనసేనతో పాటు తాజాగా బీజేపీ కూడా జట్టు కట్టడంతో మంత్రిలో మరింత టెన్షన్ మొదలైందన్న చర్చ స్థానికంగా సాగుతోంది. ఈ సారి కుమారున్ని రాజకీయ ఆరంగేట్రం చేయిద్దామనే ఆలోచన కూడా సత్తిబాబులో ఉంది అయితే జిల్లాలో వైసీపీకి వ్యతిరేక పవనాలు వీస్తుండడం, నియోజకవర్గంలో పార్టీనుంచి టీడీపీలోకి వలసలు ఎక్కువ ఉండడంతో సత్తిబాబు ఆశలపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. ఈ నేపథ్యంలోనే చీపురుపల్లికే మంత్రి అన్నట్లు వారంలో నాలుగురోజులు నియోజకవర్గంలో పర్యటనలు పెట్టుకుంటున్నారని సర్వత్రా చర్చ.

బైక్ సరదా ప్రాణం తీసింది

రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి



రాకేష్(ఫైల్)

జామి, మార్చి 10 : కుటుంబం అంతా శుభకార్యం హడావిడిలో ఉంది. ఆ బాలుడు బైక్ నడపాలన్న ఉత్సాహంతో బంధువులను వేరొక చోట దించేసి వస్తానని వెళ్లాడు. బయలుదేరిన కొద్ది సెకెన్లలో కుక్క అడ్డు రావడంతో ఉన్నఫలంగా బ్రేక్ వేశాడు. కిందపడిపోవడంతో తలకు బలంగా గాయాలయ్యాయి. అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. శుభకార్యం జరుగుతున్న ఆ ఇంట తీవ్ర విషాదం అలముకుంది. మండలంలోని కుమారాంలో ఆదివారం జరిగిన ఈ దుర్ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి.

కుమారాం గ్రామానికి చెందిన సన్యాసిరావు ఆటోడ్రైవర్. ఈయన తమ్ముడు కూతూరు శుభకార్యం ఆదివారం గ్రామంలో జరుగుతోంది. ఫంక్షన్‌కు సన్యాసిరావు, భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక్కగానొక్క కుమారుడు రాకేష్(14)తో వచ్చాడు. అందరూ బంధుమిత్రులతో సంతోషంగా ఉన్నారు. ఇదే సమయంలో బాలుడు రాకేష్ తమ బంధువులకు చెందిన ద్విచక్రవాహనం నడిపేందుకు తీసుకున్నాడు. చుట్టాలను దించేసి వస్తానని బయలుదేరాడు. కొద్దిదూరం వెళ్లగానే కుక్క అడ్డురావడంతో బ్రేక్ వేశాడు. కింద పడిపోయిన రాకేష్ తలకు బలమైన గాయం కావడంతో సంఘటన స్థలంలోనే ప్రాణం విడిచాడు. శుభకార్యం సందడిలో వున్న రాకేష్ ఎప్పుడు బండి తీసుకువెళ్లాడో తెలియదంటూ కుటుంబసభ్యులు విలపించిన తీరు అందర్నీ కంటతడి పెట్టించింది. ఎస్‌ఐ వీరబాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు. రాకేష్ అదే గ్రామంలో వున్న ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు.

ఏడుసార్లు వాయిదా

● మున్సిపాలిటీలో కొలిక్కిరాని ఆశీలు వేలం
● హాజరుకాని కాంట్రాక్టర్లు.. సిండికేట్ అయ్యేందుకు ప్రయత్నాలు
● చేతులెత్తేసిన కమిషనర్.. పాలకవర్గం లేకే పాట్లు

రాజాం మున్సిపాలిటీలో ఆశీళ్ల వసూళ్లకు సంబంధించిన వేలంపాట కొలిక్కి రావడం లేదు. వేలంపాటకు నిర్దేశించిన తేదీల్లో కాంట్రాక్టర్లు హాజరు కాకపోవడం, వచ్చినా అభ్యంతరాలు చెప్పడం వంటి కారణాలతో ఏడుసార్లు వేలంపాట వాయిదా పడింది. మున్సిపల్ యంత్రాంగం నిర్దేశించిన పాట మొత్తంపై జీఎస్టీ లేకుండా వేలంపాట నిర్వహించాలని తొలుత డిమాండ్ చేసిన కాంట్రాక్టర్లు... కనీసపు పాట మొత్తం తగ్గించాలని కొత్తరాగం ఆలపించారు. ఈ విషయంలో తానేమీ చేయలేనని కమిషనర్ చేతులెత్తేశారు.

రాజాం రూరల్, మార్చి 10:
రాజాం మున్సిపాలిటీలో సాధారణ మార్కెట్‌తో పాటు కబేళా ద్వారా వచ్చే ఆదాయం వసూలు చేసుకునేందుకు వీలుగా ఏటా వేలం పాట నిర్వహిస్తూ వస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం గడచిన మూడేళ్ల వేలంపాట ఆధారంగా ప్రస్తుత సంవత్సర వేలంపాట ప్రారంభపు ధర నిర్ధారిస్తారు. ఆ ప్రకారం 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.34.50 లక్షలుగా నిర్ణయించారు. ఈమొత్తంపై 18 శాతం జీఎస్టీ అదనంగా చేర్చినట్లు కమిషనర్ స్పష్టం చేశారు. దీంతో తొలిసారి వేలంపాటలో పాల్గొన్న కాంట్రాక్టర్లు జీఎస్టీ లేకుండా వేలంపాట ధర నిర్ణయించాలని డిమాండ్ చేస్తూ పలుమార్లు కమిషనర్ రామ అప్పలనాయుడికి వినతిపత్రాలు అందజేశారు. ఆ తర్వాత జీఎస్టీ లేకుండా వేలంపాట ధర నిర్ణయిస్తూ కమిషనర్ తేదీలను ప్రకటిస్తూ వస్తున్నారు. వేలంపాటకు హాజరైన కాంట్రాక్టర్లు రూ.34.50 లక్షల మొత్తం కూడా తగ్గించాలని డిమాండ్ చేస్తూ వేలంపాటలో పాల్గొనకుండా వెనుదిరిగే పరిస్థితి నెలకొంటోంది. అయితే వేలంపాట మొత్తాన్ని తగ్గించే అధికారం కమిషనర్‌కు లేకపోవడంతో వేలంపాటలు వాయిదా పడుతూ వస్తున్నాయి.

పాలకవర్గం లేక..

2005 అక్టోబరు 10న రాజాం నగర పంచాయతీగా ఏర్పడి, మూడేళ్ల క్రితం మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ పొందినా నేటికీ ఎన్నికలు జరగకపోవడంతో పాలకవర్గం లేకుండా పోయింది. దీంతో కొన్ని ప్రత్యేక సందర్భాలలో అధికారులు నిర్ణయం తీసుకునే వెసులుబాటు లేకుండా పోతోంది. గతంలో శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం మున్సిపాలిటీలో ఇదే తరహా సమస్య ఎదురైనప్పుడు పాలకవర్గం సుమారు ఏడు లక్షల వేలంపాట మొత్తాన్ని తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. కాగా కాంట్రాక్టర్లు సిండికేట్ అయ్యేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో సైతం కాంట్రాక్టర్లు సిండికేట్‌గా ఏర్పడి మున్సిపాలిటీకి రావాల్సిన ఆదాయానికి గండి కొట్టినట్లు ఆరోపణలున్నాయి.

ఖరారు కాకపోతే..

ఆర్థిక సంవత్సరం ఆరంభం నాటికి వేలంపాట ఖరారు కాకపోతే ఏప్రిల్ 1 నుంచి మున్సిపల్ సిబ్బందే డైలీ మార్కెట్ వసూలు చేపట్టే అవకాశాలున్నాయి. గతంలో సైతం మూడు నెలల పాటు మున్సిపల్ సిబ్బంది కబేళా, డైలీ మార్కెట్ వసూలు చేపట్టారు.



అభివృద్ధిపై కోలగట్ల శ్వేతపత్రం విడుదల చేయగలరా?

● రచ్చబండలో అదితి గజపతిరాజు

విజయనగరం(ఆంధ్రజ్యోతి)/విజయనగరం రూరల్: ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి 2019 నుంచి 2024 వరకూ చేపట్టిన అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయగలరా? అంటూ అదితి గజపతిరాజు ప్రశ్నించారు. టీడీపీ రాష్ట్రశాఖ ఆదేశాల మేరకు ఆదివారం గొల్లలపేట గ్రామంలో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. ప్రజలు అధిక సంఖ్యలో హాజరైన ఈ కార్యక్రమంలో అదితి మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు, కేంద్రమంత్రిగా అశోక్ గజపతి రాజు విజయనగరం జిల్లాకు, విజయనగరానికి ఎన్నో నిధులు తీసుకువచ్చారన్నారు. టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, పిళ్లా విజయ్‌కుమార్ మాట్లాడుతూ, విజయనగరం ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి నియోజకవర్గంలో రోడ్డు, కాలువ, గెడ్డ, చెరువు దేనినీ వదలడం లేదని, ఆక్రమణకు కాదేదీ అనర్హం అంటూ అన్నింటినీ ఆక్రమించేస్తున్నారన్నారు. రచ్చబండ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఈగల సత్యారావు యాదవ్ మాట్లాడుతూ, రూ. 6 కోట్లలో గొల్లలపేట, గొల్లలపేటకు శివారు గ్రామాల అభివృద్ధి అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్రమంత్రి అశోక్ గజపిరాజు చలవేనన్నారు. ● 'బాబు ష్యూరిటీ భవిష్యత్తుకి గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని గొల్లలపేట గ్రామానికి వచ్చిన టీడీపీ విజయనగరం నియోజకవర్గ అభ్యర్థి అదితి గజపతిరాజుకు గొల్లలపేట మాజీ సర్పంచ్ ఈగల సత్యరావు, మాజీ ఎంపీటీసీ ఈగల రమణతో పాటు ఆ గ్రామస్థులంతా ఊరి పొలిమేర నుంచి ఊరేగింపుగా ఆదితిగజపతిరాజుని తమ గ్రామానికి తీసుకువెళ్లారు. అడుగడుగునా హారతులు పట్టారు.

విజయనగరం రూరల్: మహిళా దినోత్సవ కానుకగా, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రకటించిన 'కలలకు రెక్కలు' కార్యక్రమాన్ని నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విజయనగరం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి అదితి గజపతిరాజు చెప్పారు. ఆదివారం 50వ డివిజన్ పరిధిలోని వైఎస్సార్ నగర్‌లో ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్ హామీలను వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ 'కలలకు రెక్కలు' కార్యక్రమంతో ఎంతో మేలు జరుగుతుందన్నారు. పెరిగిన ధరలను అదుపుచేయలేని అసమర్థ ప్రభుత్వం ఇదేనన్నారు. రాష్ట్రంలో కొత్త పరిశ్రమలు రాలేదని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమి అభ్యర్థిగా ఎన్నికల బరిలో ఉన్న తనని సైకిల్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని ఆమె కోరారు. టీడీపీ నాయకులు సియ్యాదుల సీతమ్మ, ఝాన్సీ, తోట రమేష్, గెద్ద శ్రీనివాసరావుతో పాటు టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

టెన్షన్... టెన్షన్..

విజయనగరం నియోజకవర్గ పరిధిలోని గొల్లలపేట గ్రామం ఇందుకు వేదికైంది.. మూడు రోజుల క్రితమే టీడీపీ ఆ గ్రామంలో 'భవిష్యత్తుకి భరోసా', రచ్చబండ కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించింది. ఇక వైసీపీ నేతలు రంగంలోకి దిగారు. గొల్లలపేటలో టీడీపీ కార్యక్రమాన్ని అడ్డుకోవడమే కాకుండా, పోటీగా ఒక కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించారు. దీనికోసం టీడీపీ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను కొంత మంది చించేశారు. దీనిపై టీడీపీ, వైసీపీ నేతలు ఇద్దరూ రూరల్ పోలీసులను



మాట్లాడుతున్న అదితి గజపతిరాజు

ఆశ్రయించారు. ఇరు పార్టీల నేతలు, కార్యకర్తలతో రూరల్ పోలీసు స్టేషన్ అధికారులు మాట్లాడి ఎవరి కార్యక్రమాలు వారు చేసుకోవాలని సూచించారు. దీంతో ఇరు పార్టీ నాయకులు, కార్యకర్తలు శాంతించారు. అయితే ఆ గ్రామంలో ఏదైనా జరగవచ్చునన్న ఉద్ధేశంతో వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అదే స్థాయిలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల నుంచి గ్రామానికి తరలివచ్చారు. ఆదివారం సాయంత్రం 6 గంటలకు రెండు పార్టీలు తమ, తమ కార్యక్రమాలు ఏర్పాటు చేశాయి. స్థానికులు, వివిధ ప్రాంతాలనుంచి నాయకులు, కార్యకర్తలు గొల్లలపేటకు చేరుకోవడంతో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా రూరల్ పోలీసులు పికెటింగ్ ఏర్పాటు చేసి.. రెండు కార్యక్రమాలు జరిగే విధంగా ప్రణాళిక సిద్ధం చేశారు.. దీంతో ప్రశాంతంగా రెండు కార్యక్రమాలు జరిగాయి.

గంజాయి తరలిస్తున్న మహిళలు అరెస్టు



గంజాయి తరలిస్తూ పట్టుబడ్డ మహిళలతో పోలీసులు

విజయనగరం (క్రైమ్): విజయనగరం రైల్వేస్టేషన్‌లో రైళ్లలో ఆదివారం విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ కె. వెంకటరావు ఆధ్వర్యంలో ఎస్.ఐ రవివర్మ, సిబ్బంది తనిఖీలు చేపడుతుండగా కోరాపుట్ జిల్లాకు చెందిన సుమిత్రాబడైక్, రేఖమాకముడీ అరకు రైల్వేస్టేషన్ మీదుగా విశాఖ తరలిస్తుండగా గంజాయితో పట్టుబడ్డారు. వీరి వద్దనుంచి 25.4 కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ వెంకటరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాల స్మగ్లింగ్ ముఠాలను అరికట్టేందుకు జీఆర్పీ, ఆర్‌పీఎఫ్ ప్రత్యేక టీమ్‌ల సహాయంతో నిఘాను పెంచామన్నారు. అరుకు, పార్వతీపురం, బొబ్బిలి, ఎస్.కోట, కొత్తవలస రైల్వేస్టేషన్లలో విస్తృత తనిఖీలు చేపడుతున్నామని, పట్టుబడినవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చికిత్స పొందుతూ బాలిక మృతి

భోగాపురం: ముక్కాం గ్రామానికి చెందిన దుమ్ము కావ్య(11) కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందినట్టు సీఐ ఎ.రవికుమార్ తెలిపారు. కావ్య ముక్కాం హైస్కూల్లో ఆరో తరగతి చదువుతోంది. తల్లిదండ్రులు విడిపోగా, కావ్య. తండ్రి పోలయ్య నాన్నమ్మ వద్ద ఉంటోంది. ఈనెల 3వ తేదీన తన ఇంట్లో మరుగుతున్న వేడినీటితో ఉన్న పాత్రను స్టౌవ్‌పై నుంచి దించేందుకు ప్రయత్నించగా, ప్రమాదవశాత్తు జారిపోయింది. వేడినీరు ఆమె శరీరంపై పడింది. దీంతో శరీరం కాలిపోయింది. చికిత్స నిమిత్తం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందింది. దీనిపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

బురదపాడులో పూరిల్లు దగ్ధం

గంట్యాడ: బురదపాడు గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం జరిగిన అగ్ని ప్రమాదంలో పెంటబోను అర్జునకు చెందిన పూరిల్లు దగ్ధమయ్యింది. ఈ ప్రమాదంలో అర్జునకు చెందిన సుమారు రూ.80వేలు విలువ చేసే వస్తు సామగ్రి కాలిబూడిదయ్యింది. అయితే ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. గ్రామ రెవెన్యూ కార్యదర్శి లావణ్య ఘటనా స్థలం వద్దకు వెళ్లి పరిస్థితి పరిశీలించి తహసీల్దార్ నీలకంఠేశ్వరరావుకు సమాచారం ఇచ్చారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

దత్తిరాజేరు: రాజులరామచంద్రాపురంలో పేకాట ఆడుతున్న పేకాట రాయళ్లను అరెస్టు చేసినట్టు స్టేషన్ బూర్జవలస ఎస్ఐ లక్ష్మీప్రసన్నకుమార్ ఆదివారం తెలిపారు. రాజులరామచంద్రాపురంలో ఒక మామిడితోటలో పేకాట ఆడుతున్నట్టు అందిన సమాచారం మేరకు దాడిచేసి వారి నుంచి రూ.5,020 స్వాధీనం కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

రామభద్రపురం: మండల పరిధిలోని చందాపురం గ్రామం వద్ద ఆదివారం సాయంత్రం పోలీసులు జరిపిన దాడుల్లో నలుగురు పేకాటరాయళ్లను అరెస్టు చేసినట్టు ఎస్ఐ జ్ఞానప్రసాద్ తెలిపారు. వీరివద్ద నుంచి రూ.18వేల వంద రూపాయలు స్వాధీనం చేసుకొని కేసు నమోదుచేసినట్టు తెలిపారు. ఈ దాడుల్లో స్థానిక పోలీసు కానిస్టేబుళ్ల పాల్గొన్నారు.

మద్యం సీసాలు సీజ్

రేగిడి: మండలంలోని సంకిలిలో ఆదివారం ఎన్నికల సోదాల్లో భాగంగా పోలీసులు నిర్వహించిన తనిఖీలో బెల్ట్ షాపు నిర్వాహకుడు నుంచి 20 మద్యం సీసాలు సీజ్‌చేసి నట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. బెల్ట్‌షాపు నిర్వహణకు తెచ్చిన మద్యాన్ని కిరాణాషాపులో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని నిందుతున్ని అరెస్టు చేసినట్లు చెప్పారు. తనిఖీలో ఏఎస్ఐ రాజారావు, కానిస్టేబుల్ శివ ఉన్నారు. **భోగాపురం:** కొల్లిపేట సమీపంలో అక్రమంగా మద్యం తరలిస్తున్న అదే గ్రామానికి చెందిన కె.సన్యాసమ్మపై కేసు నమోదు చేశామని ఎస్ఐ పి.సూర్యకుమారి ఆదివారం తెలిపారు. ఈ మేరకు ఆమె వద్ద నుంచి 12 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

పాలకొండ: మండలంలోని రాజుపేట జంక్షన్ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పట్టణానికి చెందిన కుమారి(28) అనే మహిళ మృతిచెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. కుమారి పనుకువలస గ్రామ రహదారి పక్కన ఉన్న వెంట్రుకుల ఫ్యాక్టరీలో పనిచేస్తోంది. ఫ్యాక్టరీకి స్కూటీపై వెళ్తున్న సమయంలో అదుపు తప్పి ప్రమాదం జరిగినట్టు స్థానికులు చెబుతున్నారు. స్థానికుల సమాచారం మేరకు 108 వాహనం ద్వారా పాలకొండ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి శ్రీకాకుళంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. కుమారి భర్త తాపీమేస్త్రీ కాగా, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

యువతి అదృశ్యం

గరుగుబిల్లి: రావివలసకు చెందిన ఓ యువతి గత కొద్ది రోజులుగా కనిపించడం లేదని ఆమె తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గరుగుబిల్లి పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. యువతికి ఇటీవల వివాహం చేసేందుకు తల్లిదండ్రులు నిర్ణయించారు. వివాహ సంబంధం కుదిరిన తరుణంలో బట్టలు కుట్టించేందుకు గత కొద్ది రోజుల కిందట బొబ్బిలి వెళ్లిన ఆమె.. ఇంటికి తిరిగి రాలేదు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కొనసాగుతున్న 'జయ హో ఎస్సీ'



ఇంటింటికీ సూపర్ సిక్స్ హామీలను వివరిస్తున్న ఎస్సీ సెల్ నాయకులు

విజయనగరం రూరల్, మార్చి 10: టీడీపీ రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు విజయనగరంలో టీడీపీ ఎస్సీ సెల్ విభాగం ఆధ్వర్యంలో 'జయ హో ఎస్సీ' కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. 27 వ డివిజన్ పరిధిలోని జొన్నగుడ్డిలోని మధ్యవీధి, పెద్దవీధి ప్రాంతాల్లో టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు ఇంటింటికీ వెళ్లి, చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలను ప్రజలకు వివరించారు. అదే విధంగా మరోవైపు ఐదేళ్ల కాలంలో దళితుల సంక్షేమాన్ని ఈ ప్రభుత్వం విస్మరించిందని, టీడీపీతోనే దళితుల సంక్షేమం సాధ్యమని ఆ పార్టీ నాయకుడు మామిడి రవిశంకర్, టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు ఇంటింటికీ వెళ్లి వివరించారు.

నేడు స్పందన కార్యక్రమం రద్దు

కలెక్టరేట్: జిల్లా కలెక్టరు కార్యక్రమంలో ఈనెల 11న సోమవారం కలెక్టరేట్‌లో జరగాల్సిన స్పందన కార్యక్రమం రద్దు చేశారని కలెక్టర్ నాగలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

13న మెగా వైద్యశిబిరం

జామి: మండల కేంద్రమైన జామిలో టీడీపీ మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఆధ్వర్యంలో విశాఖపట్నం గీతం యూనివర్సిటీ మెగా వైద్యశిబిరం ఈనెల 13న బుధవారం నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల కార్యదర్శి వర్రి రమణ తెలిపారు. అన్ని రకాల వ్యాధులకు స్పెషలిస్ట్ వైద్యులు వైద్యపరీక్షలు చేస్తారని అవసరమైన వారు ఉపయోగించుకోవాలని కోరారు. ఈ శిబిరం వర్రి రమణ కల్యాణ మండపంలో ఉంటుందని తెలిపారు.

13న జాబ్‌మేళా

జామి: మండలంలోని బాలాజీ డిగ్రీ కళాశాలలో ఈనెల 13న బుధవారం మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఏపీఎస్ఎస్‌డీసీ జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి నీలం గోవిందరావు తెలిపారు. ఈ జాబ్‌మేళాలో 20 బహుళజాతి కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయని పది, ఇంటర్, డిగ్రీ, బీటెక్, పోస్ట్ గ్రాడ్యుయేట్, ఐటీఐ కోర్సుల్లో ఉత్తీర్ణత సాధించిన వారు ఈ ఇంటర్వ్యూల్లో పాల్గొనవచ్చన్నారు. ఈ ఇంటర్వ్యూలు ఉదయం 9గంటల నుంచి ఉంటాయని 18నుంచి 35ఏళ్లలోపు వారు హాజరుకావొచ్చన్నారు. హాజరయ్యే అభ్యర్థులు తమ ఒరిజినల్ ధ్రువపత్రాలు, పాస్‌పోర్టు సైజు ఫొటోలతో హాజరుకావాలని కోరారు. ఇతర వివరాల కోసం 79898 26953 సంప్రదించాలని కోరారు.

నేడు ఎన్నికల ప్రచారం

రాజాం: మునిసిపాలిటీలో పరిధిలోని 11 వార్డులో గల మల్లిఖార్జునకాలనీ, బాబానగర్ కాలనీల్లో సోమవారం ఉదయం 7.30 గంటలకు రాజాం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు టీడీపీ పట్టణాధ్యక్షుడు నంది సూర్య ప్రకాష్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి పురపాలక సంఘం పరిధిలోని 24 వార్డుల అనుబంధ కమిటీ సభ్యులు, వార్డు సభ్యులు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జిలు పాల్గొనాలని కోరారు.

'అధినేత నిర్ణయం శిరసావహిస్తాం'

రాజాం: అధినేత నిర్ణయాన్ని శిరసావహిస్తామని జనసేన నాయకులు తెలిపారు. ఆదివారం రాజాంలో జనసేన పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి ఎన్నిరాజు అధ్యక్షతన కార్యకర్తల సమావేశం జరిగింది. కార్యక్రమంలో రేగిడి మండల పార్టీ అధ్యక్షుడు శాసపు అప్పలనాయుడు, గార శివరాం పాల్గొన్నారు.

30 నుంచి టీఆర్టీ

సాలూరు రూరల్, మార్చి 9: టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్(డీఎస్సీలో టీఆర్టీ) కు పాఠశాల విద్యాశాఖ రీ షెడ్యూల్ విడుదల చేసింది. ఈ నెల 30 నుంచి వచ్చేనెల 3 వరకు ఉపాధ్యాయ నియామకానికి పరీక్షలను నిర్వహించనున్నట్టు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్ కుమార్ ప్రకటించారు. కాగా ఉమ్మడి జిల్లా ప్రాతిపదికగా టెట్, డీఎస్సీని నిర్వహి స్తున్నారు. టెట్ పరీక్షలు ఈ నెల 9 వరకు జరగనున్నాయి. ఈ నెల 14న వాటి ఫలితాలు వెలువడనున్నాయి. డీఎస్సీకి గత నెల 25 వరకు దరఖాస్తులు స్వీకరించారు. టెట్ ఫలితాలు వెలువడిన వెంటనే ఈ నెల 15 నుంచి డీఎస్సీ పరీక్షలను నిర్వహించడంపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. కేవలం ఒక్కరోజు గడువు ఉండడంతో కొందరు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో టెట్, డీఎస్సీకి కనీసం నాలుగు వారాల గడువు ఉండాలని కోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో తాజాగా రీ షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈ నెల 30 నుంచి వచ్చే నెల 3 వరకు రోజుకు రెండు విడతలుగా ఎస్జీటీల నియమానికి అర్హత పరీక్షను నిర్వహించ నున్నారు. వచ్చే నెల 7న టీజీటీ, పీజీటీ, ప్రిన్సిపాల్ పోస్టుల కోసం ఆంగ్ల భాష ప్రావీణ్య పరీక్ష నిర్వహించనున్నారు. వచ్చే నెల 13 నుంచి 30 వరకు పాఠశాల సహాయకులు, టీజీటీ, పీజీటీ, ప్రిన్సిపాల్, ఫిజికల్ డైరెక్టర్ పోస్టుల భర్తీ కోసం అర్హత పరీక్షలను నిర్వహించనున్నారు. కాగా ఉమ్మడి జిల్లాలో ఎస్జీటీలు 103, పాఠశాల సహాయకులు 97, టీజీటీ 84 మొత్తంగా 284 ఉపాధ్యాయ ఖాళీలను చూపించారు.

ఓటుతో జగన్‌కు గుణపాఠం చెప్పాలి

● రాజాం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కోండ్రు మురళీమోహన్



పార్టీలో చేరిన వారితో కోండ్రు మురళీమోహన్

రాజాం: సీఎం జగన్‌రెడ్డి పాలనలో దగాపడిన అందరూ వచ్చే ఎన్నికల్లో ఓటుతో గట్టిగా గుణపాఠం చెప్పాలని రాజాం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కోండ్రు మురళీ మోహన్ కోరారు. ఒక్కచాన్స్‌తోనే సీఎం జగన్‌రెడ్డి ఎస్సీల నడ్డి విరిచారని ఆరోపించారు. ఆదివారం శ్యాంపురం క్యాంపు కార్యాలయంలో మండలంలోని సోపేరు గ్రామానికి చెందిన 20 వైసీపీ ఎస్సీ కుటుంబాలు టీడీపీలో చేరగా, వారికి పార్టీ కండువావేసి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టీడీపీఅధికారంలో ఉన్న సమయంలో దళితులకు సబ్ ప్లాన్ నిధులు కార్లు, నిరుద్యోగభృతి, 11 డీఎస్సీలతో ఇచ్చిన 1,50 లక్షల టీచరు పోస్టులు, రైతు రుణమాఫీ, అన్న దాత సుఖీభవ, పసుపు-కుంకుమ, చంద్రన్న బీమా, పండుగ కానుకలు, పెళ్లి కానుకలు, ఇరిగేషన్ ప్రాజెక్టులు, రూ.16 లక్షల కోట్లు పెట్టుబడులు, 10లక్షల ఉద్యోగాలు గుర్తుకొ స్తాయన్నారు. వైసీపీకి చెందిన కోటగిరి హరి, దినేష్, ములగ దుర్గారావు, శంకరరావు, పెరుమాలి లక్షణ, గునాపు గురు వులు, పట్నాన పోలారావు, జరజాన ఆదినారాయణ, పెరుమాలి నూకాలు, అ ప్పారావు తదితరులు కుటుంబాలు టీడీపీలో చేరాయి. కార్యక్రమంలో పార్టీ నాయకులు కోటగిరి నారాయణరావు, బుక్క రామారావు, జరజాన నీలయ్య పాల్గొన్నారు. ● రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కలిసికట్టుగా పనిచేసి విజయానికి సహ కరించాలని నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ సూచించారు. ఆదివారం శ్యాంపురం క్యాంపు కార్యాలయంలో అఖిల గాండ్ల తెలకల సంక్షేమ సంఘం నాయకులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. నాయ కులు దుప్పలపూడి శ్రీనివాసరావు, గురవాన నారాయణరావు, నంది సూర్యప్రకాష్‌రావు, టంకాల కన్నంనాయుడు, శాసు రమేష్‌కుమార్, మరిపి జగన్మోహన్‌రావు పాల్గొన్నారు. ● ఎన్నికల శంఖారావంతో వైసీపీ ప్రభుత్వం భూ స్థాపి తం కానుందని కోండ్రు మురళీమోహన్ తెలిపారు. మునిసిపాలిటీలోని 14 వార్డులో మీనాక్షీ కాలనీ, మొంతిపేట, గోపాల పురంలో ఎన్నిక ప్రచారం నిర్వ హించారు. 12వ వార్డు గాయిత్రీ కాలనీ, తిమ్మయ్యపేటలో నిర్వహించిన ప్రచా రంలో కోండ్రుకు ఘనస్వాగతం పలికారు. పార్టీ పట్టణాధ్యక్షుడు నంది సూర్య ప్రకాష్‌రావు, పొట్టా చిట్టిబాబు, టంకాల కన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

'బహుజన భేరీ'ని జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సోము రాంబాబు

విజయనగరం దాసన్నపేట, మార్చి 10: బహుజనులకే రాజ్యాధికారం లక్ష్యంగా ఈ నెల 15న బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో విజయవాడలోని విద్యాధరపురం లేబర్ కాలనీలో చేపట్టనున్న బహుజన భేరీ సభకు జిల్లా నుంచి భారీఎత్తున బహుజనులంతా హాజరై జయప్రదం చేయాలని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి సోము రాంబాబు పిలుపునిచ్చారు. ఆదివారం జమ్ములోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో, రాష్ట్రంలో త్వరలో జరగబోయే ఎన్నికలకు తమ పార్టీ ప్రచార సన్నద్ధతకు ఈ సభ నాంది అని అభివర్ణించామన్నారు. రాష్ట్రంలో అరాచక పాలనలతో ఎస్సీ, ఎస్టీ, బీసీలు, క్రిస్టియన్లు, మైనార్టీలు అణచివేతకు గురయ్యారని, ప్రభుత్వ పాలనలో బహుజనులకు రక్షణ లేదని, అభివృద్ధి లేదని, యువతకు ఉపాధి లేదని, చివరకు దళితులు సాగు చేస్తున్న భూములను సైతం ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో బీఎస్పీ నాయకులు ఆర్షి శివప్రసాద్, బుద్దుడు, రామప్పడు, వెంకటరావు, అశోక్, అంబేడ్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఉంగరాడమెట్టలో గురుకుల ప్రవేశ పరీక్ష



పరీక్ష నిర్వహణపై సిబ్బందితో సమీక్షిస్తున్న మార్టిన్

రేగిడి: మండలంలోని ఉంగరాడమెట్ట గురుకుల పాఠశాలలో ఐదో తరగతి, ఇంటర్ విద్యార్థులకు ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పరీక్ష కేంద్రాలను స్టేట్ అబ్జర్వర్ మార్టిన్ తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, పరీక్షల నిర్వహణ, సౌకర్యాలు, పరిశుభ్రత ప్రమాణాలపై ప్రిన్సిపాల్ బుచ్చి రాజుతో మాట్లాడారు. ఐదోతరగతి పరీక్షకు 219 విద్యార్థులకు గాను 162 మంది, మధ్యాహ్నం నిర్వహించిన ఇంటర్ పరీక్షకు 227 మంది విద్యార్థులకు 108 మంది హాజరయ్యారు.

మాతాశిశువుల ఆరోగ్యంపై దృష్టి సారించండి

మక్కువ: మాతాశిశువుల ఆరోగ్యంపై దృష్టి సారించాలని డ్వామా పీడీ కె.రామచంద్రరావు ఆదేశించారు. స్థానిక వెలుగు మహిళా సమాఖ్య భవనంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ఏడాదిలో పది కంటే తక్కువగా శిశు మరణాల రేటు ఉండాలన్నారు. వాటి సంఖ్య తగ్గించడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. వైద్య మహిళా సంఘాలు, సచివాలయ సిబ్బంది గ్రామాల్లో గర్భిణులు, బాలింతలకు రక్తహీనతపై అవగాహన కల్పించాలని సూచించారు. పౌష్టికాహారం తింటున్నారా? లేదా అనేది పర్యవేక్షించాలని ఆదేశించారు. మక్కువ, పాచిపెంట ఎంపీడీవోలు పి.దేవకుమార్, లక్ష్మీకాంత్, వైద్యాధికారులు రెడ్డి హరికృష్ణ, నిఖిల, కిరణ్‌కుమార్ ఉన్నారు.

రాష్ట్ర ప్రయోజనాల కోసమే కూటమి ఏర్పాటు



జనసేన ఆత్మీయ సమావేశం

శృంగవరపుకోట, మార్చి 10: ఆంధ్రప్రదేశ్ ప్రయోజనం కోసమే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఏర్పడిందని జనసేన నాయకుడు ఒబ్బిన సన్యాసినాయుడు అన్నారు. ఆదివారం స్థానిక ఫంక్షన్ హాల్లో జనసేన పార్టీ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కూటమిలో ఏపార్టీకి టిక్కెట్ కేటాయించినా అభ్యర్థి గెలుపుకోసం జనసైనికులు సమిష్టిగా కృషిచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఐదు మండలాల జనసైనికులు కొట్యాడ లోకాబి రామకోటి, సుంకర అప్పారావు, గొరపల్లి రవికుమార్, జామి వర్మరాజు, రామెళ్ల శివాజీ, అలమండ రాంబాబు, జొన్న పల్లి సత్తిబాబు, దేగల ఈశ్వరరావు తదితరులున్నారు.

విషమ పరిస్థితుల్లో ప్రజాస్వామ్య వ్యవస్థ



మాట్లాడుతున్న భీశెట్టి బాబ్జీ

విజయనగరం దాసన్నపేట, మార్చి 10: రాష్ట్రంలో ప్రజాస్వామ్య వ్యవస్థ విషమ పరిస్థితుల్లో ఉందని, అధికారులు, నాయకులు నిబంధనలకు నీళ్లొదిలేసి వ్యవహరిస్తున్నారని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. ఆదివారం ఆర్ అండ్ బీ సమీపంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా ఓటర్లను ప్రలోభ పెట్టే కార్యక్రమాలు పెద్ద ఎత్తున జరుగుతున్నా, పట్టించుకునే నాథుడు లేరన్నారు. ఎలాగైనా అధికారం చేపట్టాలన్నా ఉద్దేశంతో వ్యవస్థలను నాశనం చేస్తున్నారని రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా ఓటర్ల జాబితాలో భారీ స్థాయిలో అక్రమాలు జరిగాయని విమర్శించారు. కేంద్ర ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవడంలో విఫలమైందన్నారు. పార్టీ నాయకులు రామచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

బాలికావలసలో ఎన్ఎస్ఎస్ సేవలు

రేగిడి: మండలంలో బాలికావలసలో రాజాం జీఎంఆర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఆదివారం రెం డోరోజు ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సేవలు కొనసాగించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ యూనిట్ పీవో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వలంటీర్లు ఇంటింటికి వెళ్లి ఆరోగ్యప్రమాణాలు, శానిటే షన్‌పై అవగాహన కల్పించారు. అనంతరం కళాశాల కంప్యూటర్ టీచర్ రమేష్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు డిజిటల్ విద్యపై వివరించారు.

మహిళల్లో ఐక్యత అవసరం

రాజాం రూరల్: మహిళలు ఐక్యంగా ఉంటే సమాజంలో ఏదైనా సాధించవచ్చని సిస్టర్ పూజ తెలిపారు. రాజాంలోని చీపురుపల్లి రోడ్‌లో చర్చిలో మహిళా దినోత్సవం ఆదివారం నిర్వహించారు. సిస్టర్ నీలవేణి, గ్లోరీ, రూబీ, సుజాత, మౌనిక, పద్మ, ప్రైడీపాల్, లక్ష్మి, శిరీష తదితరులు పాల్గొన్నారు.

సావిత్రిబాయికి నివాళి



ఎల్‌కోటలో..



బొబ్బిలిలో..

లక్కవరపుకోట, మార్చి 10: మండలంలోని జమ్మాదేవిపేట వద్దగల మహాత్మా జ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాలలో సావిత్రిబాయి పూలే వర్ధంతిని ప్రిన్సిపాల్ యువికే.పాత్రో ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వ హించారు. పాఠశాల సిబ్బంది విద్యార్థులతో కలిసి పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి అంజలి ఘటించారు. మహిళా విద్యాభివృద్ధికి పూలే చేసిన సేవలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమ,లో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ● **బొబ్బిలి:** భారతదేశ మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయిని, చదువులతల్లి సావిత్రీబాయి పూలే వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక సంఘంవీధిలో అంబేద్కర్ పోరాటసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సోరు సాంబయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సావిత్రి బాయి పూలే మహిళా సంఘం నియోజకవర్గ అధ్యక్షురాలు సురపల్లి ప్రేమజ పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల అక్షరాస్యత కోసం ఆమె చేసిన చురుకైన సామాజిక ఉద్యమం, ఎదు ర్కొన్న సవాళ్లను విద్యార్థులకు వివరించారు. ఆమెను ఆదర్శంగా తీసుకొని మహి ళలు ఉన్నత స్థానానికి ఎదగాలని పిలుపునిచ్చారు. పేదలకు బట్టలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బి.రవికుమార్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. సావిత్రిబాయి సేవలను కొనియాడారు.

కొమ్మలు కాదు.. చెట్లు కొట్టేశారు

● విద్యుత్‌లైన్లకు అడ్డంగా ఉన్నాయని తొలగింపు

● ఇదీ రాజాం -శ్రీకాకుళం రోడ్డులో పరిస్థితి

రాజాం రూరల్: రాజాంలోని రాజాం -శ్రీకాకుళం రోడ్డులో విద్యుత్‌సరఫరాకు అంతరాయం కలుగుతోందని ట్రాన్స్‌కో అధికారులు ఏకంగా చెట్లనే కొట్టేసిన పరిస్థితి ఆదివారం నెలకొంది. వాస్తవానికి విద్యుత్‌సరఫరా సాఫీగా జరగడానికి, ఎటువంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా ఉండేందుకు కొమ్మలను తొలగించాల్సిఉంది. కానీ ఇక్కడ విద్యుత్‌లైన్లకు అడ్డంగా ఉన్నాయని పేర్కొని ఈ రోడ్‌లో వేంకటేశ్వర స్వామి దేవస్థానం నుంచి దుర్గాదేవి అమ్మవారి ఆలయం వరకూ పది వరకు చెట్లను తొలగించడం విశేషం. నిత్యం రద్దీగా ఉండే మార్గం కావడంతో చుట్టుపక్కల మండలాల నుంచి రాజాం వచ్చేవారంతా ఈ చెట్ల కిందే సేదదీరేవారు. దీనికితోడు ప్రస్తుతం వేసవి సీజన్ కూడా ప్రారంభమయ్యింది. ఇక్కడ చెట్ల కిందే స్థానికులతో పాటు పట్టణానికి వివిధ పనులపై వచ్చే వారంతా చేరుతున్నారు. ఈ నేపథ్యంలో చెట్లు తొలగించడంతో పట్టణవాసులతోపాటు పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.



గొడ్డలివేటుకు నేలకొరిగిన వృక్షాలు

మహిళలకు అన్ని హక్కులు కల్పించాలి

రామభద్రపురం, మార్చి 10: పురుషులతో సమానంగా మహిళలకు కూడా అన్ని రంగాల్లో సమాన హక్కులు కల్పించాలని సీఐటీయూ జిల్లా నాయకులు పి.శంకరరావు కోరారు. మండల కేంద్రంలో ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా మహిళలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనికి తగ్గ వేతనం, శ్రమ దోపిడీ చేయకుండా సమానహక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఇటీవల మహిళలపై హింస, అత్యాచారాలు యథేచ్ఛగా జరుగుతున్నాయని, వీటిని అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలం చెందాయన్నారు. ఇటువంటి చర్యలపై మహిళా సంఘాలు పెద్ద ఎత్తున పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ఇటీవల కాలంలో టీవీ సీరియళ్లు, ఫేస్‌బుక్, యూట్యూబ్‌లలో మహిళలను అసభ్యకరంగా చూపిస్తున్నారని, వీటిని కూడా అరికట్టాలని కోరారు. అంగన్‌వాడీ, ఉద్యోగులు, ఉపాధిహామీ కూలీలు, ఆశా, మధ్యాహ్న భోజన మహిళలు పాల్గొన్నారు.

నాకో ఓటు.. ఎమ్మెల్యేకు ఓ ఓటు వేయాలి

● బొబ్బిలిలో కాపు కుల సంఘ సమావేశంలో ఎంపీ బెల్లాన

బొబ్బిలి: బొబ్బిలిలో ఆదివారం సాయంత్రం కాపుకుల సంక్షేమసంఘం సమావేశం జరిగింది. కాపుకుల సంఘం అధ్యక్షుడు ఉంగట్ల రాంబాబు పిలుపు మేరకు జరిగిన ఈ సమావేశంలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు, కాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్ పాల్గొన్నారు. ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థిగా మళ్లీ తానే పోటీ చేస్తున్నానని, గతంలో మాదిరిగా తనను ఎంపీగా, శంబంగిని ఎమ్మెల్యేగా గెలిపించాలని కాపుకులస్తుందరినీ కోరారు. బొబ్బిలి మున్సిపల్ ఎన్నికల్లో ఎక్స్‌అఫీషియోసభ్యుని హోదాలో తన ఓటు హక్కును ఈ మున్సిపాలిటీలోనే వినియోగించుకున్న విషయాన్ని ఎంపీ గుర్తు చేశారు. ఎంపీ స్థానానికి చిన్నశీను పోటీ చేయాలని భావించినా సీఎం జగన్ మళ్లీ తననే బరిలోనికి దించుతున్నట్లు ఎంపీ తెలిపారు. ఎమ్మెల్యే శంబంగి మాట్లాడుతూ బీసీలు మెజార్టీ సంఖ్యలో ఉన్నందున తమను గెలిపించాలని కోరారు. బీసీలు ఎన్నికైతే తమతో పనులు చేయించుకోవడం సులువవుతుందన్నారు. కాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్ మాట్లాడుతూ బొబ్బిలిలో కాపుకుల సంక్షేమ సంఘం భవన్ కోసం నిధులు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణారావు, రామభద్రపురం జెడ్‌పీటీసీ అప్పికొండ సరస్వతి, లక్ష్మనాయుడు, రౌతు రామ్మూర్తి తదితరులున్నారు.

మూలకు చేరిన సోలార్ నీటి పథకం



దిష్టిబొమ్మలా దర్శనమిస్తున్న సోలార్ ప్యానల్

వంగర: వంగర పీ హెచ్‌సీలో సోలార్ నీటి పథకం మూణ్నాళ్ల ముచ్చ టగా మారింది. ఏర్పాటు చేసిన రెండు నెలలకే మూలకుచేరింది. గర్భిణులు, బాలింతలకు వేడి నీరు అందించేందుకు సోలార్ రక్షిత మంచినీటి పథకం ఇక్కడ ప్రారంభిచారు. గత ప్రభుత్వం రాజాం నియోజకవర్గాన్ని పైలెట్ ప్రాజెక్టు గా తీసుకుంది. దీంతో అప్పటి కేంద్రమంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు మండలంలో ఒక్కో యూనిట్ ఏర్పాటుచేశారు. ఎంపీ నిధులు సమకూర్చి ఇక్క డ పనులు పూర్తిచేయించారు. అయితే నిర్వహణలోపం వల్ల ప్రారంభించిన కొద్దిరోజులకే మూలకుచేరింది. కొద్దిపాటి నిధులతో వినియోగంలోకి వచ్చే అవ కాశం ఉన్నా మరమ్మతులపై దృష్టిసారించడం లేదన్న విమర్శలొస్తున్నాయి. కా గా సోలార్ పథకం మరమ్మతు చేయించి రోగు లకు వేడినీరు అందించేలా చర్యలు తీసుకుంటామని సీహెచ్‌వో రామారావు తెలిపారు.

వైసీపీని తరిమికొట్టాలి

● బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో సూపర్‌సిక్స్ పథకాలపై టీడీపీ నాయకుల ప్రచారం



పార్వతీపురం: జెండా ఆవిష్కరిస్తున్న విజయచంద్ర, జగదీష్, చిరంజీవులు



సాలూరు రూరల్: మాట్లాడుతున్న సంధ్యారాణి



కురుపాం రూరల్: జరడలో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

రానున్న ఎన్నికల్లో వైసీపీని తరిమికొట్టాలని తెలుగుదేశం పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఆదివారం టీడీపీ నాయకులు సూపర్‌సిక్స్ పథకాలపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందజేశారు. టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వస్తే చేపట్టబోయే సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. పలుచోట్ల వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు.

టీడీపీ-జనసేన విస్తృత ప్రచారం

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: జిల్లా కేంద్రం పార్వతీపురం పట్టణంలో టీడీపీ, జనసేన పార్టీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బోనెల విజయచంద్ర ఆదివారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ముందుగా టీడీపీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ద్వారపురెడ్డి శ్రీదేవి పాల్గొంటూ ప్రచారంచేశారు ఇంటింటికి వెళ్లి బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంపై వివరించారు.కార్యక్రమంలో టీడీపీ నాయకులు బార్నాల సీతారాం, ఎం.సత్యనారాయణ, మజ్జి వెంకటేష్, కోలా మధుసూదనరావు, జి.రవికుమార్, రాజశేఖర్, మరియదాసు, బడే గౌరునాయుడు, టి.సత్యనారాయణ, డాక్టర్ భానుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. 19, 24వ వార్డుల్లో జరిగిన ప్రచార కార్యక్రమంలో విజయ్‌చంద్రకు మహిళలు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు.

సంధ్యారాణికి పాస్టర్లు మద్దతు

సాలూరు: రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన బలపరిచిన అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణికి తమ సంపూర్ణ మద్దతు ఇస్తామని సాలూరు నియోజకవర్గ పాస్టర్లు తెలిపారు. పట్టణంలోని మెంటాడ వీధిలో ఉన్న శ్రీకోదండ రామ కల్యాణ మండపంలో నియోజకవర్గ పాస్టర్ల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా ముఖ్యఅతిథులుగా బాగువలసకు చెందిన పాస్టర్ ఫిలిప్స్, గుమ్మిడి సంధ్యారాణి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ (వీఆర్ఎస్) చింతగడ దాస్ పాల్గొన్నారు. ఈసందర్భంగా పాస్టర్లు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో తామంతా సంధ్యారాణికి తమ మద్దతు తెలియజేస్తామని తెలిపారు. ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం పాస్టర్లకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. పాస్టర్లకు పెన్షన్ ఇస్తామని చెప్పి మోసం చేశారన్నారు. అనంతరం సంధ్యారాణి గెలుపు కోసం ప్రత్యేక ప్రార్థనలు చేసి ఆమెను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పలువురు పాస్టర్లు పాల్గొన్నారు.

టీడీపీలో పలువురి చేరిక

పార్వతీపురం రూరల్: పార్వతీపురం పట్టణంలో 11 వార్డుకు చెందిన పలువురు టీడీపీలోచేరారు. మండలంలోని వెంకంపేటలో ఉన్న టీడీపీ- జనసేన ఉమ్మడి అభ్యర్థి బోనెల విజయచంద్ర స్వగృహం వద్ద జరిగిన కార్యక్రమంలో 11వ వార్డుకు చెందిన వివిధ పార్టీలకు చెందిన పలువురు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.వీరికి పార్టీ కండువాలు వేసి విజయచంద్ర ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు మజ్జి వెంకటేష్ పాల్గొన్నారు.

విజయమే లక్ష్యంగా పనిచేస్తాం

బెలగాం: పార్వతీపురం నియోజకవర్గంలో గెలుపే లక్ష్యంగా కలిసి పనిచేస్తామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి.శ్రీనివాస్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బోనెల విజయచంద్ర, జనసేన నాయకుడు అనిల్ అన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన పొత్తు అయిన సందర్భంగా ఆదివారం స్థానిక బీజేపీ కార్యాలయానికి ఉమ్మడి అభ్యర్థి విజయచంద్రను సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అరాచర పాలన చేస్తున్న వైసీపీని తరిమికొట్టడానికి, రాష్ట్ర అభివృద్ధికి మూడు పార్టీల కలయిక జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గరుగుబిల్లి: కొత్తపల్లిలో సూపర్‌సిక్స్ పథకాలపై ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

గెలుపే లక్ష్యంగా పనిచేయండి

గరుగుబిల్లి: కురుపాం నియోజకవర్గంలో తెలుగుదేశం, జనసేన ఉమ్మడి అభ్యర్థి తోయక జగదీశ్వరి గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని టీడీపీ నాయకుడు గొట్టాపు లక్ష్మంనాయుడు కోరారు. కొత్తపల్లిలో క్లస్టర్ ఇన్‌చార్జిలతో కలిసి ఇంటింటికి వెళ్లి టీడీపీ మేనిఫెస్టో, సూపర్ సిక్స్‌పై వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మర్రాపు పృథ్వీరాజు, గొట్టాపు సత్యంనాయుడు, మర్రాపు శ్రీను, గంగాధరరావు పాల్గొన్నారు.

● **కురుపాం రూరల్:** జరడ పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల్లో ఆదివారం కురుపాం టీడీపీ, జనసేనపార్టీ ఉమ్మడి అభ్యర్థి తోయిక జగదీశ్వరి ఆధ్వర్యంలో శంఖారావం, సూపర్ సిక్స్ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జగదీశ్వరి మాట్లాడుతూ రాబోయేది తెలుగుదేశం పార్టీ అని తెలిపారు. కార్య క్రమంలో టీడీపీ మండల కన్వీనరు కలిశెట్టి కొండయ్య, వెంపటాపు భారతి, కిరణ్, శంకర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

● **సాలూరు రూరల్:** సాలూరు మండలంలో గిరిశిఖర గ్రామాలైన కొదమ, చొర, చింతామల తదితర గ్రామాల్లో టీడీపీ సాలూరు అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. సాలూరు మండలంలో ఎత్తైన గిరిశిఖర గ్రామాలైన కొదమ పంచాయతీ, కొఠియా గ్రూప్ గ్రామాలైన పట్టుచెన్నారు, పగులుచెన్నారు, డొలియాంబ గ్రామాలకు ఆదివారం ఆమె ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు వెళ్లాయి. ఆయా గ్రామాల్లో బాబు ష్యూరిటీ, భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడారు. వైసీపీ హయాంలో గిరిజనులకు జరిగిన అన్యాయం జరిగిందన్నారు. పలు పథకాలు తీసివేశారన్నారు. రాష్ట్ర భవిష్యత్‌కు టీడీపీ రావడం అవశ్యమన్నారు. వైసీపీ పాలనపై ధ్వజమెత్తారు. కార్యక్రమంలో సాలూరు మండల టీడీపీ అధ్యక్షుడు ఆముదాల పరమేశు,అక్యాన వెంకట తిరుపతిరావు, మాలతి దొర,గణపతి,లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

వంతెన కూలిపోయి.. రహదారి కొట్టుకుపోయి

● శిథిలావస్థకు చేరినా మరమ్మతులకు నోచుకోని వైనం

● ఇదీ సబ్బన్నపేట-మెట్టసబ్బన్నపేట ఉప్పుగెడ్డపై వంతెన పరిస్థితి

భోగాపురం: మండలంలోని సబ్బన్నపేట, మెట్టసబ్బన్నపేట గ్రామాల మధ్య ఉప్పుగెడ్డపై వంతెన దశాబ్దాల తరబడి కనీస మరమ్మతులకు నోచుకోవడం లేదు.ఈనేపథ్యంలో వంతెన కూలిపోవడంతోపాటు రహదారి కొట్టుకుపోవడం తో ఈమార్గంలో రాకపోకలు సాగించే వారంతా అవస్థలకు గురవుతున్నారు. వంతెన శిథిలావస్థకు చేరినా ప్రజాప్రతినిధులు, అధికారులు చోద్యం చూస్తున్నా రని పలువురు ఆరోపిస్తున్నారు.

ఇదీ పరిస్థితి

సబ్బన్నపేట, మెట్టసబ్బన్నపేట గ్రామాల మధ్య గెడ్డపై రాకపోకలకు అనుకూలంగా వంతెన నిర్మించారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు సులువుగా రాకపోకలు సాగించేవారు. అయితే గత కొన్ని సంవత్సరాలుగా ఈ వంతెన కొద్ది కొద్దిగా శిథిలమవుతూ ప్రస్తుతం పూర్తిగా కూలిపోయింది. అలాగే అప్పు డప్పుడు నీరు అధికంగా ప్రవహించడంతో వంతెనతో పాటు ఇరువైపులగల రహదారి కొట్టుకుపోయింది. దీంతో ఆయా గ్రామాల ప్రజల రాకపోకలకు ఇబ్బందులు మొదలయ్యాయి. రహదారి ప్రమాదకరంగా ఉన్నప్పటికీ ఆయా గ్రామాల ప్రజలు తప్పనిసరి పరిస్థితుల్లో రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో అనేకమంది వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. వంతెన ఏర్పాటుపై అనేక పర్యా యాలు ఆయా గ్రామాల ప్రజలు ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. అయినా ఎటువంటి ఫలితం లేదు. ఇప్పటికైనా స్పందించి ఉప్పుగెడ్డపై వంతెన నిర్మించి, సమస్యను పరిష్కరించాలని ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు కోరుతున్నారు.



శిథిల వంతెనపై రాకపోకలు సాగిస్తున్న వాహనదారుడు

అనుమతులు రాలేదు

దీనిపై ఆర్‌అండ్‌బీ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వి.రవికుమార్‌ను వివరణ కోరగా, సుమారు మూడేళ్ల కిందట ఉప్పుగెడ్డ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించారని, అయితే ఎటువంటి అనుమతులు రాలేదని చెప్పారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయం

మక్కువ: మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని డిప్యూటీ సీఎం రాజన్నదొర అన్నారు. మక్కువలో నాలుగో విడత వైఎస్సార్ చేయూత కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. మండలానికి సంబంధించి 4,415 మంది సభ్యులకు 8 కోట్ల 27లక్షల 81వేల 250 రూపాయల చెక్కును అందించారు. అనంతరం నూతన జడ్పీ ఉన్నత పాఠశాల భవనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు మావుడి శ్రీనివాసరావు, వైసీపీ మండల అధ్యక్షుడు మావుడి రంగునాయుడు, ఎంపీపీ మర్రి పారమ్మ, ఎంపీడీవో దేవకుమార్, సన్నిబాబు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

జనసేనలో చేరిక

భోగాపురం: భోగాపురం గ్రామంలోని కాకర్లపూడి శ్రీనివాసురాజు కార్యాలయంలో ఆదివారం భోగాపురం, ముంజేరు, ముక్కాం గ్రామాలకు చెందిన పలువురు వైసీపీ నుంచి జనసేన పార్టీలో చేరారు. వీరిని జనసేన-టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి లోకం నాగమాధవి పార్టీలోకి ఆహ్వానించారు. జనసేనలో చేరినవారిలో వరుపుల సుధాకర్, పలంట్ల శ్రీనివాసరావు, మైలపల్లి అప్పలకొండ, జక్కుపు రవి తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో లోకం ప్రసాదు, పల్లంట్ల జగదీష్ పాల్గొన్నారు.

నెల్లిమర్ల: కొండవెలగాడ గ్రామానికి చెందిన అట్టాడ మహేష్‌తో పాటు పలువురు యువకులు టీడీపీ-జనసేన కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి లోకం మాధవి ఆధ్వర్యంలో ఆదివారం జనసేన పార్టీలో చేరారు. ఈసందర్భంగా మహేష్ మాట్లాడుతూ జనసేన పార్టీ ఆశయాలు, సిద్ధాంతాలు, మాధవి సేవా గుణం నచ్చి జనసేన పార్టీలో చేరినట్లు వివరించారు.



భోగాపురం: జనసేనలో చేరిన వారిని ఆహ్వానిస్తున్న నాగమాధవి

రాష్ట్ర ప్రయోజనాల కోసమే పొత్తు

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున

చీపురుపల్లి: రాష్ట్ర ప్రయోజనాలకోసం టీడీపీ, జనసేన,బీజేపీలతో పొత్తుకు సిద్ధమయ్యిందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడినాగార్జున అన్నారు. ఆదివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. బీజేపీ సహకారంతో రాష్ట్ర సత్వర అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల పూర్తి, ఇతర అభివృద్ధి పనులకు కేంద్రంలోని బీజేపీ సహకారం అవసరమని గుర్తించి ఆ పార్టీతో పొత్తు కుదుర్చుకున్నట్టు తెలిపారు. మూడు పార్టీల పొత్తుతో వైసీపీలో వణుకు మొదలయ్యిందన్నారు.



మాట్లాడుతున్న నాగార్జున

ఉమ్మడి అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలి

● జనసేన పార్టీ సమన్వయకర్త కద్రక మల్లేశ్వరరావు



కురుపాంలో మాట్లాడుతున్న జనసేన నాయకులు

కురుపాం:ఎన్నికల్లో కురుపాంనియోజకవర్గంలో తెలుగుదేశం, జనసేన ఉమ్మడి అభ్యర్థి గెలుపుకు జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని జనసేన పార్టీ సమన్వయకర్త కద్రక మల్లేశ్వరరావు కోరారు. ఆదివారం కురుపాంలో నియోజకవర్గం జనసేన పార్టీ ముఖ్య నాయకులు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎన్నికలలో తెలుగుదేశం, జనసేన ఉమ్మడి అభ్యర్థి గెలుపుకు ఎలా పనిచేయాలన్న విషయాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యనిర్వ కార్యదర్శి గార గౌరిశంకరరావు, కురుపాం, జియ్యమ్మవలస మండల పార్టీ అధ్యక్షులు నేరేడబిల్లి వంశీ, వారణాశి శివకుమార్, నియోజవక్గంలోగల నాయకులు పాల్గొన్నారు.

మహిళలను గౌరవిద్దాం



మహిళలను సత్కరిస్తున్న నోబుల్ వాకర్స్ క్లబ్ సభ్యులు

పార్వతీపురంటౌన్: మహిళలను గౌరవిద్దామని వాకర్స్ ఇంటర్నేషనల్ గవర్నర్ జె.నారాయణస్వామి అన్నారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా నోబుల్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో వివిధ రంగాలకు చెందిన మహిళలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ ఏరియా వైస్‌ప్రెసిడెంట్, ఐ.గున్నేష్, వాకర్స్ జిల్లా కార్యదర్శి డీవీ రమణ, డిప్యూటీ గవర్నర్ వెంకటనాయుడు, నోబుల్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు ఆర్.సత్యంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతుల్లో సాగు చేయాలి



పంటల యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గరుగుబిల్లి: గ్రామాల్లో రైతులు ఆదాయం అందించే పంటలను యాజమాన్య పద్ధతుల్లో సాగు చేయాలని ఉల్లిభద్ర డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డా.బి.ప్రసన్నకుమార్ సూచించారు. మండలంలోని సంతోషపురం, సుంకి పంచాయతీల్లో అరటి, పామాయిల్, మామిడి తోటలను ఆయన ఆదివారం పరిశీలించారు. రైతులు సాగు చేస్తున్న తోటల్లో రోగ నిర్ధారణ సందర్శన చేసి తెగుళ్ల నివారణకు అవసరమైన సూచనలు అందిం చారు. ఉద్యాన కళాశాల దత్తత తీసుకున్న గ్రామాల్లో మన గ్రామం - మన విశ్వ విద్యాలయం కార్యక్రమంలో భాగంగా జాతీయ సేవా పథకంలో పలు కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. అధికంగా తోటలతో పాటు కూరగాయల పంటల్లో తెగుళ్ల ఆశిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు డా.బి.హరిరామకుమార్, డా.జి.నరసింహమూర్తి, సీహెచ్ కిరణ్‌కుమార్, డా.ఎన్.ఝాన్సీరాణి, తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశ పరీక్ష

భామిని: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో 2024-25 విద్యా సంవత్సరంలో ప్రవేశానికి నిర్వహించిన పరీక్షకు 80 శాతం హాజరైనట్టు పాఠశాల ప్రిన్సిపాల్ ఎం. విజయనిర్మల తెలిపారు. ఆదివారం ఐదో తరగతిలో జరిగిన ప్రవేశపరీక్షకు 68 మంది, మధ్యాహ్నం ఇంటర్మీడియట్‌కు 112 మంది హాజరయ్యారు. ఎగ్జామ్ చీఫ్‌గా పాఠశాల ప్రిన్సిపాల్ వ్యవహరించగా డిపార్ట్‌మెంట్ ఆఫీసర్‌గా మృత్యుంజయరావు, పరిశీలకుడిగా భాస్కరరావు వ్యవహరించారు.



పరీక్ష రాసి బయటకొస్తున్న విద్యార్థులు

'పది' విద్యార్థుల సన్నద్ధతకు పరీక్ష

మక్కువ: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో సార్వత్రిక విద్యాపీఠం పదో తరగతి సన్నద్ధత పరీక్షలను ఆదివారం నిర్వహించారు. 80 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. పరీక్ష నిర్వహణను సార్వత్రిక విద్యాపీఠం మండల కో- ఆర్డినేటర్ కోట సత్యారావు పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

రాములు మాస్టారికి నివాళి

బొబ్బిలి: పట్టణానికి చెందిన విశ్రాంత హెచ్‌ఎం, ఏపీటీఎఫ్ జిల్లా నాయకుడు డోకల రాములు భౌతిక కాయానికి ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ ఆదివారం నివాళులు అర్పించారు. ఏపీటీఎఫ్ జిల్లా నాయకునిగా రాములు విశేషమైన సేవలందించారని, అలాగే తన విద్యాబోధనతో, మంచి క్రమశిక్షణతో కూడిన బ్రహ్మాండమైన శిష్యగణాన్ని సమాజానికి అందించారని కొనియాడారు. ఏపీటీఎఫ్ పతాకాన్ని రాములు భౌతికకాయంపై ఉంచి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఏపీటీఎఫ్ నాయకులు జేసీ రాజు, జోగినాయుడు, శ్రీనివాసరావు, పార్వతీపురం మన్యం జిల్లా నాయకులు బాలకృష్ణ, రేజేటి నాగేశ్వరరావు, గేదెల చంద్రినాయుడు తదితరులు నివాళులు అర్పించారు. ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, టీడీపీ ఇన్‌చార్జి బేబీనాయన కూడా వేర్వేరుగా రాములు మాస్టారు భౌతిక కాయానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు.



నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్సీ రఘువర్మ, ఏపీటీఎఫ్ నాయకులు

విద్యుత్, నీటి పొదుపుపై అవగాహన

బొబ్బిలి: మండలంలోని నారాయణప్ప వలస-కాశిందొరవలస జంట పంచాయతీల్లో ఇందిరా గాంధీ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు నిర్వహిస్తున్న సేవా శిబిరంలో భాగంగా ఆదివారం విద్యుత్, నీటి పొదుపుపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. వీధి వీధినా ర్యాలీలు నిర్వహించి నినాదాలు చేశారు. ఇంటింటికీ వెళ్లి విద్యుత్‌ను పొదుపుగా ఎలా వాడాలి, నీటి వనరులను కాపాడుకునే విధానంపై గ్రామస్థులకు తెలియజేశారు. వేసవిలో తాగునీటి ఎద్దడిని నివారించుకునేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. ఎన్ఎస్ఎస్ పీవోలు వై.సత్యనారాయణ, పి.రామకృష్ణ ఆధ్వర్యంలో వలంటీర్లు సేవలందించారు.



అవగాహన కల్పిస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

వైసీపీకి కాకర్లపూడి రాజీనామా

భోగాపురం: వైసీపీలో ప్రథమంగా చేరిన కాకర్లపూడి శ్రీనివాసురాజు ఆ పార్టీకి రాజీనామా చేసినట్టు విలేకర్ల సమావేశంలో ఆదివారం ప్రకటించారు. భోగాపురం గ్రామంలోని తన స్వగృహంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వైసీపీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. ఎమ్మెల్యే బడ్డుకొండ కష్టపడినవారికి గుర్తింపు ఇవ్వడం లేదని, చులకనగా మాట్లాడుతున్నారని, అభివృద్ధి కూడా చేయడం లేదని ఆయన ఆరోపించారు. దీంతో పార్టీని వీడుతున్నట్టు తెలిపారు. ఆయనతో పాటు స్థానిక వైసీపీ నాయకులు వరుపుల సుధాకర్, బాలిపల్లి సత్తిబాబు, గుండపు నానాజీ, తదితరులు పార్టీని వీడారు.

రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన

చీపురుపల్లి: మండలంలో రెండు తారు రోడ్ల నిర్మాణానికి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఆదివారం శంకుస్థాపన చేశారు. కర్లాం నుంచి నిమ్మలవలసకు రూ.2.25 కోట్లు, జి.ములగాం నుంచి కోనూరుకు రూ.7కోట్లతో బీటీ రోడ్లు నిర్మించనున్నారు. ఈ రెండు పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం చీపురుపల్లి పంచాయతీ కార్యాలయ ఆవరణలో రూ.43.60 లక్షలతో నిర్మించిన ఐదో నెంబరు సచివాలయ భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ట్రైనీ కలెక్టర్ వెంకట త్రివినాగ్, ఎంపీపీ ఇప్పిలి వెంకటనరసమ్మ, జడ్పీటీసీ వలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పు అమలయ్యేలా చూడండి

చీపురుపల్లి: ఈపీఎఫ్ కనీస పెన్షన్ అమలులో 2014లో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు అమలయ్యేలా చూడాలని సీఐటీయూ నాయకులు ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వారు ఆదివారం ఆయనకు వినతి పత్రం అందజేశారు.ఈపీఎఫ్ పింఛన్ కనీసం రూ.7,500 ఇవ్వాలని, దీంతో పాటు డీఏ ఇవ్వాలని 2014లో భాతర ఉన్నత న్యాయస్థానం తీర్పు ఇచ్చింద న్నారు. న్యాయస్థానం తీర్పు అమలు కావడం లేదన్నారు. ఎంపీని కలిసిన వారిలో సీఐటీయూ ప్రతినిధులు అంబల్ల గౌరినాయుడు, జె.విశ్వనాథరాజు, మూర్తి, బి.జగదీష్, కంది రామారావు, పి.ఉమ, గంట్యాడ అప్పలరాజు, పి.శంకరరావు పట్నాయక్, వాసురాజు, వై.సత్యం ఉన్నారు.

సీతంపేటలో పోలీసు కవాతు

సీతంపేట: సాధారణ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ముందస్తు చర్యల్లో భాగంగా ఆదివారం సీతంపేట పోలీసు ఆధ్వర్యంలో కవాతు నిర్వహించారు. దోనుబాయి జంక్షన్ నుంచి వారపుసంత వరకు కవాతు నిర్వహిస్తూ ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఈ కార్యక్రమంలో పాలకొండ సీఐ చంద్రమౌళి, ఎస్ఐ జగదీష్‌నాయుడు, ఏఎస్ఐ సంజీవయ్య పాల్గొన్నారు.



సీతంపేట: కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

బొబ్బిలి: రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల నిర్వహణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలనే సందేశంతో బొబ్బిలి పట్టణంలో పోలీసులు ఆదివారం కవాతు నిర్వహించారు. ఎస్పీ దీపిక ఆదేశాలమేరకు మున్సిపల్ పరిధిలోని గొల్లపల్లి, దిబ్బ వీధి, సిరిపురపు వీధుల్లో కేంద్ర పోలీసు బలగాలు (ఆర్‌పీఎస్ఎఫ్), సివిల్ పోలీసులు కలిసి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మలిరెడ్డి నాగేశ్వరావు మాట్లాడుతూ ఎన్ని కలను ప్రశాంతంగా నిర్వహించేం దుకు ప్రజలంతా సంపూర్ణసహకారం అందించాలని, అసాంఘికశక్తులకు సహకరించ వద్దని, శాంతిభద్రతలకు విఘాతం కలి గించే వ్యక్తుల సమాచారం అందించాలని కోరారు.

పోలమాంబ దర్శనానికి భక్తుల తాకిడి



చదురుగుడిలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

మక్కువ: శంబర పోలమాంబ అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు ఆదివారం దర్శించుకున్నారు. గోముకి నదీతీరాన చీరలు, కోళ్లు, మొక్కులు చెల్లించుకున్నారు. వనం గుడి వద్ద వేపచెట్టుకు మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం పోలమాంబ అమ్మవారి 8వ వారం జాతర జరగనుంది.

జయకృష్ణకే టికెట్ ఇవ్వాలి

పాలకొండ: టీడీపీ ఎమ్మెల్యే టికెట్ నిమ్మక జయకృష్ణకే కేటాయించాలని నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రతిపాదించారు. ఆదివారం స్థానిక కార్గిల్ సెంటర్‌కు వేలాది మంది కార్యకర్తలు చేరుకుని జయకృష్ణకు మద్దతుగా నినాదాలు చేశారు. పార్టీ నాయకులు కర్నేన అప్పలనాయుడు, గంటా సంతోష్‌కుమార్, పాలకొండ, భామిని, సీతంపేట, వీరఘట్టం మండల అధ్యక్షులు పాల్గొన్నారు.

జరజాపుపేటలో రక్తదాన శిబిరం

నెల్లిమర్ల: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జరజాపుపేట గ్రామంలో ఆ గ్రామానికి చెందిన సాధన యువజన సంఘం ప్రతినిధులు ఆదివారం స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, సచివాలయ ఆరోగ్య కార్యదర్శుల (ఏఎన్ఎం) సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు అల్లుమల్లు మాధవి తదితరులు ప్రారంభించారు. సీపీఐ నాయకుడు తాలాడ సన్నిబాబు, ఉపాధ్యాయులు, సాధన యువజన సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

అలరించిన 'ఆనందో బ్రహ్మ'

బొబ్బిలి: స్థానిక వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం యంగ్‌మెన్స్ హేపీ క్లబ్ ఆధ్వర్యంలో ఆనందో బ్రహ్మ ఆధ్యాత్మికం పేరిట పలు కళా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. భక్తిగీతాలకు కోలాటం, నృత్యాలు ప్రదర్శించి బాల కళాకారులు ఆహుతుల ప్రశంసలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త గెంబలి శ్రీనివాసరావు, సంస్థ ప్రతినిధులు మిందివిజయమోహనరావు, పి.నాగరాజు, చప్ప అప్పలనాయుడు, కరుణకుమార్, కృష్ణదాసు తదితరులు పాల్గొన్నారు.



ఆలయ ప్రాంగణంలో కోలాటం ప్రదర్శిస్తున్న చిన్నారులు